క్లుప్తంగా

కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి

గుడివాడ టౌన్: గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల ఫలితాలు లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి పి.పద్మావతి తెలిపారు. సోమవారం ఆమె కృష్ణా యూనివర్సిటీలోని గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలించారు. కృష్ణా యూనివర్సిటీలోని రవీంద్రనాథ్ ఠాగూర్ బ్లాక్‌లో ఈ కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. నియోజకవర్గంలో 230 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. మొత్తం 17 రౌండ్‌లలో కౌంటింగ్ జరుగుతుందన్నారు. ఇందుకోసం 14 టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఇక పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్‌కు ఆరు టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ అబ్జర్వర్‌గా బన్సిలాల్ రాణా వ్యవహరిస్తారన్నారు. కౌంటింగ్ అధికారులు, సిబ్బంది ఉదయం 4.50 గంటల లోపు, ఏజెంట్‌లు ఐదు గంటల లోపు పోలింగ్ కేంద్రానికి చేరాలని సూచించినట్లు తెలిపారు.

జోరుగా ఉపాధి పనులు



మండవల్లి: జాతీయ ఉపాధి హామీ పథకం పనులు జోరుగా జరుగుతున్నట్లు ఎంపీడీఏ ఎస్.నవీన్ పేర్కొన్నారు. మండలంలోని మూడు తాళ్లపాడులో సోమవారం పంట కాలువ పూడికతీతకు, ఉపాధి హామీ పథకం ద్వారా రూ. 70 వేలు నిధులు మంజూరైనట్లు ఎంటీఏ తెలిపారు. 47 మంది కూలీలు పనులు చేశారన్నారు. ఈ కారణంగా పంట పొలాలకు సాగునీరు సక్రమంగా చేరుతుందన్నారు. దీంతో పంటల దిగుబడి పెరిగి రైతులకు మేలు కలుగుతుందని తెలిపారు.

సమస్యలు పరిష్కరిస్తాం

పామర్రు: స్థానిక ఉరుటూరు రోడ్డులోని ఎస్ఎంటీ ఎఫ్-1, ఎఫ్-2 కాలనీ వాసుల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా తగు చర్యలు తీసుకుంటామని గ్రామ కార్యదర్శి అబ్దుల్ సలీం పేర్కొన్నారు. ఎస్ఎంటీ కాలనీ వాసులు తమ సమస్యలను పరిష్కరించాలని సోమవారం అర్జీని సమర్పించారు. ఈ విషయమై కార్యదర్శి మాట్లాడుతూ సమస్యలలో కొన్ని పనులు చేయిస్తామని, మరి కొన్ని పనులు కాలనీ వాసులే చేయించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు కె.శ్రీవల్లి, కె.సాయికుమారి, శాంతికుమారి, ఎన్.రామ సుబ్బులు, నూతలపాటి నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

ఫైరింగ్‌పై శిక్షణ



గుడివాడ టౌన్: స్థానిక ఏఎన్ఆర్ కళాశాలలో మే 27 నుంచి జూన్ 5వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాంప్‌లో సోమవారం గన్ ఫైరింగ్‌పై శిక్షణ ఇచ్చినట్లు క్యాంప్ కమాండర్ కల్నల్ సన్నార్‌సింగ్ తెలిపారు. శిక్షణలో ఫైరింగ్ అనేది ముఖ్యాంశంగా పరిగణిస్తామన్నారు. ప్రతి ఎన్‌సీసీ క్యాడెట్ విధిగా ఫైరింగ్‌లో నైపుణ్యం కలిగి ఉండాలన్నారు. ఎన్‌సీసీ ముఖ్య ఉద్దేశం దేశ సంరక్షణలో యువత అవసరం వచ్చినప్పుడు అన్ని అంశాలలో నైపుణ్యం గల వారిని ఎంపిక చేస్తారన్నారు. ఆ సమయంలో ఎన్‌సీసీలో తర్ఫీదు పొందిన వారికి ప్రథమ స్థానం కల్పిస్తారన్నారు. దీనికి తోడు శిక్షణలో ఎ, బి, సి సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. దేశ భద్రతకు సంబంధించిన శాఖలలో ఉద్యోగ అవకాశాలు లభించినప్పుడు వీరికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. కృష్ణా జిల్లాలోని నాలుగు కళాశాలలకు చెందిన 102 మంది, ఎనిమిది పాఠశాలలకు చెందిన 301 మంది విద్యార్థులకు ఇక్కడ శిక్షణ ఇస్తున్నామన్నారు. 16వ ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిబిరం ఈనెల 5వ తేదీ ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీజీఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, ఎన్‌సీసీ అధికారి ఎండీ.సలీమ్, బీఎస్ఎస్ పద్మజ పాల్గొన్నారు.

కొనసాగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాలు

బంటుమిల్లి: మండల పరిధిలోని చోరంపూడి, నాగేశ్వరరావుపేట గ్రామాల్లోని కొలువై ఉన్న శ్రీ అభయాంజనేయస్వామి మందిరాల్లో హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా మూడో రోజైన సోమవారం స్వామివార్లకు విశేష పూజలు, లక్ష్మీగణపతి హోమాలను పలువురు దంపతుల పాల్గొని నిర్వహించారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన కె.చంద్రశేఖర్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను అకట్టుకుంది. సోమవారం సాయంత్రం అమ్మవారి పంచ హారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై పలు కీర్తనలకు కళాబృందంలోని సభ్యులు నృత్య ప్రదర్శన ఇచ్చారు.

ప్రజాతీర్పుపై సర్వత్రా ఉత్కంఠ

గ్రామాల్లో కౌంటింగ్ ఫీవర్



కైకలూరు మండలం దొడ్డిపట్లలో భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న రూరల్ ఎస్సై రామకృష్ణ, సిబ్బంది

కైకలూరు: ప్రజా తీర్పుపై సర్వత్రా ఉత్కంఠతతో ఎదురు చూస్తున్నారు. మరికొద్ది సమయంలో ఓట్లు లెక్కింపు ప్రారంభం కానుంది. గత నెల 13న నిర్వహించిన పోలింగ్ రోజున నియోజకవర్గంలో మొత్తం 2,056,04 ఓటర్లకు 1,79,536 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సర్వీసు ఓటర్లు 1,641 మంది ఉన్నారు. మొత్తం 87.32 శాతం ఓటింగ్ నమోదైంది. నియోజకవర్గ కౌంటింగ్ ఏలూరు సీఆర్ఆర్ కాలేజీలో మంగళవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి ప్రారంభం కానుంది. మొత్తం 14 టేబుళ్లపై 17 రౌండ్లలో కౌంటింగ్ జరగనుంది. మొదటి రౌండ్ మండవల్లి మండలం సింగనపూడి నుంచి ప్రారంభం కానుంది. ఒక్కో రౌండ్ 14 టేబుళ్ల లెక్కన నాలుగు రౌండ్లకు కొన్ని ముదినేపల్లి బూత్‌లను కలుపుకుని మండవల్లి మండలం ముగిస్తోంది. అంటే ఒకటో బూత్ నుంచి 49 బూత్ వరకు మండవల్లి మండలానికి చెందినవి. ఈ మండలంలో దాదాపు 34,621 ఓట్లు ఉన్నాయి. తర్వాత 50 బూత్ నుంచి 110వ బూత్ వరకు ముదినేపల్లి మండలానికి చెందినవి. ఇవి కూడా కొన్ని కైకలూరు మండల బూత్‌లు కలపుకుని నాలుగు రౌండ్ల కౌంటింగ్ జరగనుంది. ముదినేపల్లి మండలంలో 44,118 ఓట్లు ఉన్నాయి. తర్వాత 111వ బూత్ నుంచి 172వ బూత్ వరకు కైకలూరు మండలానికి చెందినవి. ఇక్కడ కూడా కొన్ని కలిదిండి మండల బూత్‌లను కలుపుకుని ఐదు రౌండ్లు కౌంటింగ్ నిర్వహించనున్నారు. కైకలూరు మండలంలో 51,120 ఓట్లు ఉన్నాయి. చివరిగా 173వ బూత్ నుంచి 235 బూత్ వరకు కలిదిండి మండలానికి చెందినవి. కలిదిండి మండలంలో మొత్తం ఓట్లు 49,677 పోలయ్యాయి. ఈ మండలంలో చివరి ఐదు టేబుళ్లలోని లెక్కతో కౌంటింగ్ పూర్తవుతుంది.

భారీ పోలీసు బందోబస్తు

ఓట్లు లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో ఎవరైనా కవ్వింపు చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కై కలూరు టౌన్, రూరల్ సర్కిల్ సీఐలు ఆకుల రఘు, బి.కృష్ణకుమార్ హెచ్చరించారు. ప్రజాతీర్పు ఏ పార్టీకి వచ్చినా అందరూ సహృదయంతో స్వీకరించాలన్నారు. సోషల్ మీడియా వేదికగా రెచ్చగొట్టే పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తామన్నారు. రూరల్ సర్కిల్ పరిధిలో 17 పోలీసు పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి మండలంలో ఎస్సైతో కూడిన క్యూఆర్‌టీ టీంను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ సమయంలో ప్రజలు ఏ విధంగా సహకరించారో అదేవిధంగా కౌంటింగ్ రోజున పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. కైకలూరు రూరల్ ఎస్సై టి.రామకృష్ణ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లోనూ ముందుగానే ప్రజలకు ఘర్షణలకు పాల్పడవద్దని సూచించడంతోపాటు చట్టాలపై అవగాహన కల్పించామన్నారు.

సంయమనం పాటించండి

కౌంటింగ్ కేంద్రాల వద్ద వైఎస్సార్ సీపీ ఏజెంట్లు పూర్తి సంయమనం పాటించాలని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామాల్లో ఎటువంటి గొడవలకు దిగకుండా పోలీసులకు పూర్తి సహకారం అందించాలన్నారు. ఎవరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా తొందరపడవద్దని డీఎన్నార్ సూచించారు.

ఏలూరుకు ముందుగానే చేరుకున్న ఏజెంట్లు

మంగళవారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ నేపథ్యంలో ఉదయం 6 గంటలకు లెక్కింపు కేంద్రాలకు చేరుకోవాలని ఎన్నికల అధికారులు తెలిపారు. దీంతో ఆయా పార్టీల ఏజెంట్లు, అభ్యర్థులు సోమవారం రాత్రికే ఏలూరుకు చేరుకున్నారు. కౌంటింగ్ కేంద్రం సీఆర్ఆర్ కాలేజీ సమీపంలో బస ఏర్పాట్లు చేసుకున్నారు.

ప్రజాతీర్పును ప్రతిఒక్కరూ స్వాగతించాలి

- విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు వద్దు
- కృష్ణా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ



పామర్రులోని నాలుగురోడ్ల కూడలి వద్ద జిల్లా ఎస్పీ నయీం అస్మీ

పామర్రు: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రజలు ఇచ్చిన తీర్పును ప్రతిఒక్కరూ స్వాగతించాలి, గౌరవించాలి, అంతేగాని రెచ్చగొట్టే, కవ్వింపు చర్యలకు పాల్పడరాదని కృష్ణా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ పేర్కొన్నారు. స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద ఎస్పీ సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు వరకు ప్రచారాలు, ఓటర్లను ఆకర్షించేందుకు ఎన్నో మార్గాలను అనుసరించినా కౌంటింగ్ రోజున ప్రశాంతంగా ప్రక్రియ ముగించేలా అందరూ సహకరించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా వదిలి పెట్టేది లేదన్నారు. కౌంటింగ్ రోజున 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటాయన్నారు. వాటిని ఎవరైనా అతిక్రమిస్తే కఠిన సెక్షన్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు. కౌంటింగ్ రోజున బాణసంచా విక్రయాలు, బాటిళ్లలో పెట్రోలు అమ్మకాలను రద్దు చేశామన్నారు. మద్యం విక్రయాలను నియంత్రించే చర్యలు చేపట్టామన్నారు. సోమవారం సాయంత్రం ఐదు గంటల నుంచి ఈ నెల 5వ తేదీ ఉదయం 9 గంటల వరకు సెక్షన్ 144, 30 అమల్లో ఉంటాయని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఎక్కడా కూడా గొడవలు అల్లర్లు జరగకుండా శాంతి భద్రతలను పర్యవేక్షించాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం స్థానిక ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి, స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు.గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్, పామర్రు సీఐ సుభాకర్, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎవరి తాపత్రయం వారిది



గుడివాడ టౌన్: రాష్ట్ర అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు 4వ తేదీన వెలువడుతున్న నేపథ్యంలో మద్యం సేవించి అల్లర్లు జరుగకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈనెల 4, 5 తేదీల్లో మద్యం అమ్మకాలను నిలుపుదల చేయడంతో మద్యం ప్రియులు వైన్ షాపుల ముందు బారులు తీరారు. సోమవారం సాయంత్రం ఐదు గంటల నుంచే షాపులు మూసివేస్తారని తెలుసుకున్న మద్యం ప్రియులు మధ్యాహ్నం మండుటెండలో సైతం షాపుల ముందు క్యూకట్టి కొనుగోలు చేశారు. షాపుల ముందు బారులు తీరడాన్ని ఓ వర్గం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేసింది. ఎవరి తాపత్రయం వారిది అంటూ నవ్వుకున్నారు.

ఊపందుకున్న వ్యవసాయ పనులు



తోట్లవల్లూరులో పొలానికి ఎరువును తరలిస్తున్న ట్రాక్టర్



తోట్లవల్లూరులో వేసవి దుక్కులు పూర్తయిన మాగాణి పొలం

తోట్లవల్లూరు: ఖరీఫ్ సీజన్ తరుముకొస్తుండటంతో గ్రామాల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. జూన్ తొలివారంలోకి ప్రవేశించటంతో అన్నదాతలు గత కొద్ది రోజులుగా వేసవి దుక్కులపై దృష్టి సారించారు. ఇళ్ల వద్ద ఉన్న పశువుల ఎరువును ట్రాక్టర్లు, ఎడ్లబళ్ల ద్వారా తరలించి చల్లించటంతోపాటు ట్రాక్టర్లతో మాగాణి పొలాలను దుక్కి దున్నిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రతిఏటా మండల వ్యాప్తంగా సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేస్తారు. ఇందులో భాగంగా నారుమడుల ఏర్పాటుకు అవసరమైన వరి విత్తనాలను సిద్ధం చేసుకుంటున్నారు. తొలకరి చినుకులు పడగానే నారుమడులు ఏర్పాటు చేసుకుని, సకాలంలో వరినాట్లు వేసుకోవాలనే ఆలోచనలో నిమగ్నమయ్యారు.

ప్రజారోగ్యంతో చెలగాటం

- రసాయనాలతో మగ్గుతున్న మామిడి
- విచ్చలవిడిగా కార్బైడ్ వినియోగం



కార్బైడ్‌తో మగ్గబెట్టిన మామిడి పండ్లు

గుడివాడరూరల్: గుడివాడ పట్టణంలో ఎక్కడ చూసినా కార్బైడ్‌తో మగ్గబెట్టిన మామిడి పండ్లే కనిపిస్తున్నాయి. సీజన్ ప్రారంభం నుంచే పక్వానికి రాని మామిడి కాయలను కృత్రిమ పద్ధతుల్లో మగ్గించి దుకాణాల్లో విక్రయిస్తున్నారు. ప్రధానంగా ఏలూరు రోడ్, బస్టాండ్ సెంటర్, మార్కెట్ సెంటర్ తదితర ప్రాంతాల్లో బంగినపల్లి, రసాలు అంటూ మామిడి, నీలం రకం మామిడి పండ్లను పక్వానికి రాకముందే కోసి కార్బైడ్‌తో మగ్గబెట్టి మార్కెట్‌కు తరలిస్తున్నారు. కృత్రిమ పద్ధతుల్లో పండించిన తరువాత పసుపు వర్ణంలో నిగనిగలాడుతున్న మామిడి పండ్లను రకాన్ని బట్టి డజను రూ.200 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నారు. కార్బైడ్‌తో మగ్గించిన పండ్లను తింటే పలు అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉన్నా వ్యాపారులు పట్టించుకోవడం లేదు. మామిడిపండ్ల సీజన్‌ను సొమ్ము చేసుకునేందుకు ఇష్టారాజ్యంగా విక్రయాలు చేస్తూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ప్రస్తుతం వాతావరణ మార్పుల నేపథ్యంలో ఈదురుగాలులు, పడమటి గాలుల తీవ్రత పెరగడంతో తోటల్లో కాయలు రాలిపోతున్నాయి. వీటిని కార్బైడ్ ద్వారా ఒక్క రోజులోనే మగ్గబెట్టి విక్రయాలు చేస్తున్నారు. రసాయనాలతో మగ్గపెట్టిన విషయం తెలియని ప్రజలు ఇష్టంగా కొనుగోలు చేసి తిని ఇబ్బందులు పడుతున్నారు.

కార్బైడ్ వాడకాన్ని నిషేధించినా..

కృత్రిమ పద్ధతుల్లో కాల్షియం కార్బైడ్ వినియోగించి పండ్లను మగ్గబెట్టడాన్ని ప్రభుత్వం నిషేధించినా వ్యాపారులు లెక్కచేయడం లేదు. ఇతర పద్ధతులతో పోలిస్తే అతి తక్కువ ఖర్చుతో ఒక్క రోజులోనే కార్బైడ్ ద్వారా పండ్లను మగ్గబెట్టే అవకాశం ఉండటంతో వ్యాపారులు కార్బైడ్‌ను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. కార్బైడ్ ద్వారా మగ్గించిన పండ్లను తింటే నోటిపూత, చర్మం ఎర్రబారడం, కళ్లు పొడిబారడం, నీరసం, వాంతులు తదితర సమస్యలు వస్తున్నా లెక్కచేయటం లేదు. చిన్న పిల్లల్లో సమస్య తీవ్రత మరింత అధికంగా ఉండే అవకాశం ఉంది. ప్రజారోగ్యానికి ప్రమాదకరంగా మారిన కార్బైడ్ వినియోగాన్ని అరికట్టే విషయంలో సంబంధిత అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. మామిడి తోటల్లోనే కాయలను కార్బైడ్‌తో మగ్గబెడుతున్నా విషయం తెలిసినా పట్టించుకోవడం లేదు. అసలు పండ్ల దుకాణాల వైపు కన్నెత్తి చూస్తున్న దాఖలాలు కూడా లేవు. దీంతో వ్యాపారులు విచ్చలవిడిగా రసాయనాలు వినియోగిస్తున్నారు. మామిడితో పాటు సపోటా, అరటి పండ్లను మగ్గబెట్టేందుకు కూడా కార్బైడ్ వినియోగిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కార్బైడ్ వినియోగించే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు దేశభక్తి అవసరం



గుడివాడ గ్రంథాలయంలో చిన్నారులకు చరిత్ర బోధిస్తున్న ఆనంద మోహన్‌బోస్

గుడివాడ టౌన్: విద్యార్థి దశ నుంచే దేశభక్తి అవలంబించుకోవడం వలన యువత దేశాభివృద్ధిలో భాగస్వాములవుతారని విశ్రాంత గ్రంథాలయ కార్యదర్శి దుగ్గిరాల ఆనంద మోహన్‌బోస్ అన్నారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా స్థానిక రాజేంద్రనగర్‌లోని శాఖా గ్రంథాలయంలో ఆయన సోమవారం విద్యార్థులతో దేశభక్తి, ఉద్యమ నేతలు, దేశ నాయకులు అనే అంశాలపై మాట్లాడారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్‌సింగ్ వంటి నేతలు, దేశాభివృద్ధి కొరకు తమ మేధస్సును వినియోగించిన అబ్దుల్ కలాం వంటి వారి చరిత్ర, ఇతర అంశాలను విద్యార్థులకు క్షుణ్ణంగా వివరిస్తూ ఇటువంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి.శాంతి తదితరులు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని గ్రంథాలయాధికారి షేక్ పర్వీన పేర్కొన్నారు. మండవల్లి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం పిల్లలు పొడుపు కథల పుస్తకాల ద్వారా పొడుపు కథలను చదువుకుని విజ్ఞానాన్ని సముపార్జించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని నచ్చిన పుస్తకాలు ఎలా సేకరించాలి, వాటి ఎలా వినియోగించుకోవాలనే విషయాలను గ్రంథాలయాధికారి పర్వీన పిల్లలకు వివరించారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

జమీగొల్వేపల్లి(పామర్రు): విద్యార్థులు చిన్ననాటి నుంచే తల్లిదండ్రులను, గురువులు, పెద్దల యందు గౌరవ మర్యాదలు కల్గి ఉండాలని ఉపాధ్యాయుడు దీని వంశీ కృష్ణ అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లిలోని శాఖా గ్రంథాలయంలో మానవ సంబంధాలు, సామాజిక స్పృహ అనే అంశంపై సోమవారం క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంపై బాధ్యత సేవల పట్ల స్పృహను కలిగి ఉండాలన్నారు. అనంతరం విజేతలైన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషాదేవి, గ్రంథాలయాధికారి వి.నాగసురేష్ పాల్గొన్నారు.



ముదినేపల్లి శాఖా గ్రంథాలయంలో భగవద్గీత శ్లోకాలు ఆలకిస్తున్న విద్యార్థులు



కలిదిండి గ్రంథాలయంలో లెమన్ అండ్ స్పూన్ ఆడుతున్న విద్యార్థులు

పామర్రులో ..

వేసవి శిక్షణలో భాగంగా జిల్లా శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వేమన శతకాలను, సుమతీ శతకాలను నేర్పించినట్లు స్థానిక గ్రంథాలయాధికారి ఎం.ఝాన్సీరాణి తెలిపారు. స్థానికులు అవిర్నేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిక్షణ

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు సోమవారం భగవద్గీత శ్లోకాలు బోధించారు. స్థానిక ప్రముఖులు పామర్తి ఇందు ఈ శ్లోకాలను విద్యార్థులకు సులభశైలిలో వివరించారు. అనంతరం లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి పుస్తక పఠనం ఆవశ్యకతను విద్యార్థులకు వివరించి చెస్, వాలీబాల్, క్యారెమ్స్, లూడో, చెస్ వంటి ఆటల పోటీలు నిర్వహించారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన

కలిదిండి: విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన కలిగి ఉండాలని రిటైర్డ్ ఉద్యోగి కళా కృష్ణమూర్తి అన్నారు. కలిదిండి శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గ్రంథాలయాధికారి జె.రమేష్ బాబు ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులతో పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కష్ణమూర్తి మాట్లాడుతూ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను విద్యార్థులు మెరుగుపరుచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు లెమన్ అండ్ స్పూన్ ఆటల పోటీలు నిర్వహించారు. కోరుకొల్లు గ్రంథాలయంలో విద్యార్థులకు పద్యాలు నేర్పించినట్లు గ్రంథాలయాధికారి ఆర్.రాఘవులు అన్నారు. చెస్, క్యారమ్స్ వంటి ఆటల పోటీలు నిర్మించినట్లు తెలిపారు.



మండవల్లి గ్రంథాలయంలోని పొడుపు కథలు చదువుతున్న పిల్లలు



జమీగొల్వేపల్లి గ్రంథాలయంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



పామర్రులో వేమన శతకాలను పఠిస్తున్న విద్యార్థులు

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు



స్వామి వారిని పురవీధుల్లో ఊరేగిస్తున్న భక్తులు

గుడివాడ టౌన్: స్థానిక వాసవిచౌక్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఈ నెల ఒకటో తేదీన ప్రారంభమైన ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామికి అభిషేకాలు, కల్యాణం అనంతరం సోమవారం స్వామికి సుప్రభాత సేవ, ఔపాసన, మహా పూర్ణాహుతి అనంతరం ధ్వజారోహణ చేసి నగర సంకీర్తన జరిపారు. విద్యుద్దీపాలతో అలంకరించిన వాహనంలో స్వామిని కూర్చోబెట్టి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో పాలకవర్గ గౌరవాధ్యక్షుడు బొగ్గారపు తిరుపతయ్య, అధ్యక్షుడు పోకూరి మోహనరావు, కార్యదర్శులు శేగు వెంకట రామారావు, శేగు దిలీప్ కుమార్, ప్రధాన కార్యదర్శి తిరివీధి శ్రీరాములు, కోశాధికారి పేర్ల వెంకటసుబ్బారావు, సహాయ కార్యదర్శి శేగు నాగవెంకట సత్యన్నారాయణ పాల్గొన్నారు.

16 నుంచి రంగనాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో వేంచేసి ఉన్న శ్రీ భూ నీలా పరివార సమేత శ్రీ రంగనాయకస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వేణుగోపాలరావు సోమవారం తెలిపారు. 16వ తేదీ ఉదయం స్వామివారిని పెండ్లికుమారునిగా చేయటంతో పాటు పలు పూజా కార్యక్రమాలు నిర్వహించటంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 17న ధ్వజారోహణ, జగజ్యోతి, 18న నృత్య బలిహరణ, వధూవరాన్వేషణం, 19న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ రంగనాయకస్వామి వారి కల్యాణ మహోత్సవం జరుగుతాయన్నారు. 20న స్వామి రథోత్సవం, 21న అవబృదోత్సవం, పూర్ణాహుతి, ధ్వజారోహణం, హనుమంత వాహనంపై స్వామి ఊరేగింపు, 22న శ్రీ పుష్పయాగోత్సవం కార్యక్రమాలు ఆలయ ఉప ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో నిర్వహిస్తామని చెప్పారు.

మజ్జిగ పంపిణీ

కైకలూరు: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి స్థానిక సాయిబాబా ధ్యాన మందిరం సేవా ట్రస్టు ఆధ్వర్యంలో నెల రోజులుగా మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. గాంధీబొమ్మ సెంటర్ బస్టాండ్ వద్ద కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దాతల సాయంతో మజ్జిగను సేవా ట్రస్టు చైర్మన్ కొనిజేటి శ్రీనివాసరావు పర్యవేక్షణలో పంపిణీ చేస్తున్నారు.

విజయోత్సవ ర్యాలీలు, సభలు నిషేధం

కూచిపూడి(మొవ్వ): ఎన్నికల కౌంటింగ్, ఫలితాల అనంతరం ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు పూర్తి నిషేధం అని కూచిపూడి ఎస్ఐ టీ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ నెల 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో సోమవారం మొవ్వ మండలం కూచిపూడి పోలీ స్ స్టేషన్‌లో ప్రజలు పాటించాల్సిన రూల్స్‌పై ముందస్తు హెచ్చరికలు ఎస్ఐ జారీ చేశారు. ఎస్ఐ మా ట్లాడుతూ ఎన్నికల కోడ్, 144 సెక్షన్, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున ఏ ప్రదేశంలో నలుగురు కన్నా ఎక్కువ మంది ఒకే ప్రదేశంలో గుమికూడ వద్దన్నారు. బైక్‌ల పై పెద్ద శబ్దాలు చే యటం, బాణ సంచా కాల్చటం, డీజే ఏర్పాటు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేదలకు సేవలు మరింత విస్తృతం చేయాలి



భవానీపురం(విజయవాడపశ్చిమ): రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సుబ్బారావు రావూరి(దత్త) అధికారిక పర్యటన సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ గొల్లపూడి ఆధ్వర్యంలో గొల్లపూడిలోని దత్త కల్యాణ మండపంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మూడు పేద కుంటుంబాలకు బియ్యం బస్తాలు, నిత్యావసర సరుకులు, పేద విద్యార్థులు పది మందికి స్కాలర్‌షిప్‌లు అందజేశారు. అదేవిధంగా పోలియో ఫండ్ కింద రూ. 25 వేలు అందించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ గొల్లపూడి సభ్యులు పేదలకు అందించే సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా విద్య, వైద్య సేవలు అందించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. కోవిడ్ కష్టకాలంలో రోటరీ క్లబ్ ఆఫ్ గొల్లపూడి సభ్యులు వివిధ రూపాల్లో అందించిన సేవలు మరుపురానివని గుర్తు చేశారు. కుల, మతాలకు అతీతంగా ఇబ్బందుల్లో ఉన్న ప్రతి ఒక్కరిని గుర్తించి సాయం అందించినప్పుడే సమాజంలో గౌరవం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ పార్థసారథి, రోటరీ క్లబ్ ఆఫ్ గొల్లపూడి అధ్యక్షుడు ధనేకుల భరత్ కుమార్, కార్యదర్శి మద్దాలి శ్రీనివాస కుమార్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.